క్లుప్తంగా

మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి



వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లిలోని ఎల్లమ్మ చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఆ చెరువు నుంచి హిటాచీ, జేసీబీ సాయంతో టిప్పర్ల ద్వారా ఇటుక బట్టీలకు మట్టిని తరలించేందుకు శుక్రవారం కాంట్రాక్టర్ యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. మట్టి అక్రమ తరలింపుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

'జయముఖి' అసోసియేట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జవహర్ మామిడాలకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కళాశాల ఆవరణలో జవహర్‌ను ప్రిన్సిపాల్ జానకి, వివిధ విభాగాల అధిపతులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జానకి మాట్లాడారు. జవహర్ విద్యుద్వాహక ద్రవంలో కలిపిన నానో పొడర్లను ఉపయోగించి ఎలక్ట్రికల్ డిశ్చార్జ్ మెషినింగ్ ప్రాసెస్‌పై ప్రయోగాత్మక అధ్యయనాలు అంశంపై ప్రొఫెసర్ సీహెచ్.శ్రీధర్‌రెడ్డి, వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తి చేశారని తెలిపారు.

నివాళి



పర్వతగిరి : మండలంలోని గోపనపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహబూబ్ పాషా తల్లి బీ పాషా శుక్రవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, నాయకులు రంగు రంజిత్‌గౌడ్, రాజు, బెల్లం కుమారస్వామి, దేవేందర్, బొక్కల బాబు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన పిడుగు ముని (30) గురువారం రాత్రి కురవి గేటు ఆర్‌ఓబీ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్సై సురేష్ శుక్రవారం తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన పిడుగు ముని కొంతకాలంగా గాంధీపురంలో ఉంటున్నాడని స్థానికులు పేర్కొన్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాల కారణంగా అతడు మనస్తాపానికి గురై రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తమ్ముడు నాగరాజు ఫిర్యాదు చేయగా పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించామన్నారు.

ఆర్థికసాయం

ఖిలా వరంగల్: ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్న పేదింటి మహిళకు దాతలు ఆర్థిక చేయూతనందించారు. తెలంగాణ బైక్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎండీ.జాఫర్, మెకానిక్‌లు స్పందించి మెకానిక్ సంపత్‌ను పరామర్శించి, ఆయన భార్యకు రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో మెకానిక్‌లు రాము, బి.సందీప్, దుర్గారావు, సుభాష్, ఉపేందర్, శివ, ఎండీ.సాదిక్, ఎండీ.సలీం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

ఐనవోలు : ఈనెల 28వ తేదీన గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి నల్లబెట్ల చిన్నరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గొల్ల, కురుమలు అప్పులు తెచ్చుకుని డీడీలు కట్టి రెండేళ్లు గడచినా గొర్రెలు అందించలేదని చెప్పారు. జిల్లా సదస్సు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు అయ్యేలా వత్తిడి తేనున్నట్లు చెప్పారు. హనుమకొండ జేడీ కార్యాలయం, ఎంజీఎం సెంటర్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, ప్రొఫెసర్లు హాజరుకానున్నట్లు తెలిపారు.

పల్లెల్లో 'పంచాయతీ' సందడి

● పట్టు కోసం పార్టీల ప్రయత్నాలు

సంగెం : పల్లెల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. గత నవంబర్‌లో అసెంబ్లీ, తాజాగా పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆశావహులు అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నట్టు కనపడుతోంది. గ్రామాల్లో ఏ ఇద్దరు కలిసినా పంచాయతీ ఎన్నికల గురించే చర్చ సాగుతోందంటే అతిశయోక్తి లేదు. మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానంలో ఈసారి మార్పు కోరుకుని కొత్త వారికి అవకాశం ఇవ్వాలంటూ పలు గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లో చర్చలు జోరందుకున్నాయి. అక్టోబర్ తర్వాతే పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్నట్టు సంకేతాలు వచ్చినా.. ఆ మాత్రం ముందుగా ప్రయత్నాలు మొదలెట్టకపోతే ఎలా..? అంటూ పలువురు ఆశావహులు పరోక్ష ప్రచారానికి తెర లేపుతున్నారు.

పంచాయతీలు చేజిక్కేనా..?

మండలంలో 33 జీపీలుండగా 2019లో జరిగిన ఎన్నికల్లో 8 స్థానాలను బీఆర్‌ఎస్ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. మిగితా 25 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. అందులో బీఆర్‌ఎస్-18, బీఆర్‌ఎస్ రెబెల్-4, కాంగ్రెస్-2, స్వతంత్ర-1 గెలుపొందారు. ఎన్నికల అనంతర పరిణామాల్లో బీఆర్‌ఎస్ రెబల్స్, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఒకరు, స్వతంత్రంగా గెలిచిన వారు బీఆర్‌ఎస్‌లో చేరగా చింతలపల్లి సర్పంచ్ ఇండ్ల రవికుమార్ మాత్రమే కాంగ్రెస్‌లో కొనసాగారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మెజారిటీ పంచాయతీలను కైవసం చేసుకోవాలనే అభిప్రాయం ఆ పార్టీ నాయకుల్లో కనపడుతోంది. కాగా సుమారు పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉండి ఈసారి అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఉవిళ్లూరుతున్న పరిస్థితి కనపడుతోంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన నాయకులు సైతం సర్పంచ్ పదవి కోసం ఆరాట పడుతున్నారు. దీంతో పాత, కొత్త నాయకుల నడుమ అగాధం పెరుగుతోంది. ఇలా గ్రామాల్లో రెండు నుంచి మూడు గ్రూపులు ఏర్పడి ఎవరి ప్రయత్నంలో వారే ముందుకు పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ చేజిక్కేనా అన్న చర్చ పల్లెల్లో జోరుగా సాగుతోంది.

పట్టు నిలుపుకునేందుకు బీఆర్‌ఎస్, పాగా వేసేందుకు బీజేపీ..

గతంలో 32 పంచాయతీల్లో పాగా వేసిన బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని పట్టు సడలకుండా చూసుకునేందుకు అడుగులు వేస్తోంది. ఆ పార్టీని వీడిన వారి గురించిన ప్రస్తావన లేకుండా ఉన్న శ్రేణులతోనే సత్తా చాటాలని చూస్తోంది. మండలంలో ఇప్పటివరకు బోనీ కొట్టని బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ కాళీ ప్రసాదరావును పోటీలో నిలపగా మూడోస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింత పట్టు దొరుకుతుందనే కోణంలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



సంగెం గ్రామ పంచాయతీ కార్యాలయం

కాగా బీఆర్‌ఎస్ నుంచి మరికొంత మంది అధికార కాంగ్రెస్, బీజేపీల్లో చేరుతారని ప్రచారంలో ఉంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పంచాయతీలపై పట్టు సాధించే దిశగా మూడు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

పలకరింపులతో ప్రజలతో మమేకం

గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనే తలంపుతో ఉన్న ఆశావాహులు ప్రజలను మచ్చిక చేసుకోవడంలో బిజీ అయ్యారు. ఏ పనీ లేకున్నా వార్డుల్లో తిరుగుతూ కనిపించిన వారిని అవ్వ, తాతా, బాబాయి, పిన్ని, అన్న, వదిన, తమ్ముడు, చెల్లి, అక్క, తదితర వరుసలతో మాటల్లో పెడుతున్నారు. గ్రామాల్లోని సమస్యలు, ఇంకా తాము చేయాల్సిన పనులను గుర్తిస్తూ ముందుకు సాగుతున్నారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థ సేవ చేసే వారికి ప్రజలు పట్టం కడతారన్నది జగమెరిగిన సత్యం, అయినా ఎవరి ప్రయత్నంలో వారున్నారు.

ఎమ్మెల్సీగా మల్లన్నను గెలిపించాలి

● ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



రాయపర్తి : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి : పేద కుటుంబంలో జన్మించి స్వయంకృషితో ఎదిగిన తీన్మార్ మల్లన్నను వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నాయకులు పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్లుగా ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా మల్లన్న పోరాడుతున్నాడని తెలిపారు. మల్లన్న పట్ల బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ తిరుమల కృష్ణమాచార్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చ రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ కుంట రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమూద్, నాయకులు అఫ్రోజ్, చిర్ర మల్లయ్య, శ్రీనివాస్, మచ్చ కుమారస్వామి, సోడెపు శ్రీనివాస్, ఊగ మునిత, మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, కొడగాని ఉమయాదగిరి, సమ్మయ్య, ఉల్లెంగుల నర్సయ్య, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మచ్చ నీలయ్య, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఉల్లెంగుల యాదగిరి, సుదర్శన్‌రెడ్డి, గారె భిక్షపతి పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్ మాట్లాడారు. శ్రేణులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం ప్రశాంత్, నాయకులు ఈదునూరి దిలీప్, రామారపు రాము, రావుల నర్సింహరెడ్డి, తాళ్లపెల్లి భాస్కర్, గంద్రకోటి దిలీప్, వడ్డె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అక్రమాలను ఎండగట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న కొమురారెడ్డి

గీసుకొండ : బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, అరాచకాలను శ్రేణులు ప్రజల్లో ఎండగట్టి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపునకు బాటలు వేయాలని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలూ మోసపోయారని చెప్పారు. అర్హులైన పట్టభద్రులందరూ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు దొడు భరత్, ప్రవీణ్, బోడకుంట్ల రాజు, చాడ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పులిశేరి సైకిలాబ్, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, కోల వేణు, బోడకుంట్ల కుమారస్వామి పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తే గెలుపు ఖాయం

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీనర్సింహారావు



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

రాయపర్తి : బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ చెల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికీ బాటలు వేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు విద్యుత్ కోతలు, తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం శ్రేణులు ప్రణాళికాయుతంగా పని చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, నాయకులు ఆకుల సురేందర్‌రావు, పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నార్లపురం రాజు, కోఆప్షన్ సభ్యుడు అష్రఫ్ పాషా, దీప్లానాయక్, నాగపురి సోమయ్య, చిల్వేరు సాయి, ఐత రవి, పీరని రాజు తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి



ఖానాపురం : రైతులకు నాణ్యమైన విత్తనాలనే డీలర్లు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్, ఎరువులు, విత్తనాల షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల వివరాలతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఓ శ్రీనివాస్ మాట్లాడారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు విత్తన చట్ట నిబంధనలకు లోబడి విత్తనాలు విక్రయించాలని సూచించారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లి మాజీ సర్పంచ్ గూబ యాకమ్మ ఎల్లయ్యను వారి కూతురు మమత ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు మహేశ్, నలమాస సారయ్య, కోఆప్షన్ సభ్యుడు అష్రఫ్ పాషా, చిల్వేరు సాయి, రంజిత్, కొంరుమల్లు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



ఖానాపురం : మంగళవారిపేటలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు, నాయకులు

ఖానాపురం : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు కోరారు. మండలంలోని కొత్తూరు, మంగళవారిపేట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల పక్షాన పోరాడాలంటే ప్రశ్నించే గొంతుకను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే పట్టభద్రులకు నష్టం తప్పదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పైండ్ల యాదగిరి, మక్క వెంకన్న, తొట్ల వెంకన్న, రామ్మూర్తి, సహదేవ్, బాలునాయక్, పోషబోయిన సతీష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో బీఆర్‌ఎస్ డివిజన్ ఇన్‌చార్జ్‌లు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి మాట్లాడారు. రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రహీం, కంజర్ల రవి, జాగిల్ల వీరస్వామి, నాగెల్లి సురేష్, ఆరెల్లి నాగార్జున, చెన్న వెంకన్న, దుబాసి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని మైలారంలో నిర్వహించిన ప్రచారంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ మాట్లాడారు. ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు యాకయ్య, సుధాకర్, అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని ధర్మారం, చంద్రయ్యపల్లి, మచ్చాపూర్, కొమ్మాల, బొడ్డుచింతలపెల్లి గ్రామాల్లో బీనిర్వహించిన ప్రచారంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కోట ప్రమోద్, సిరిసె శ్రీకాంత్, మంద రాజేందర్, గంగుల నాగరాజు మాట్లాడారు. ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తేనే మేలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కంబాల కోటి, పోగుల యుగేందర్, గోలి రాజయ్య, పోలెబోయిన ప్రభాకర్, నాసం మల్లేశం, గాదె సందీప్, దుపాకి నరేందర్, బట్టు రాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు



నల్లబెల్లి : మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

నల్లబెల్లి : డీలర్లు రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్ స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డీలర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. డీలర్లు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని చెప్పారు. ప్రభుత్వం నిషేదించిన బీటీ-3 పత్తి విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కొందరు వ్యాపారస్తులు మార్కెట్‌లో విత్తనాల కొరత సృష్టిస్తూ బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని తెలిపారు. రశీదు ఇవ్వకుండా విక్రయాలు జరుపుతున్నారని చెప్పారు. అలాంటి వారిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల నుంచే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు గోనె రాంబాబు, ప్రధాన కార్యదర్శి శివరాత్రి శ్రీనివాస్, కోశాధికారి మచ్చిక రవీందర్, డీలర్లు గోనె వీరస్వామి, తిరుపతిరెడ్డి, హైమద్, కేదారి తదితరులు పాల్గొన్నారు.

రశీదులు, రిజిస్టర్లు సరి చూసుకోవాలి

చెన్నారావుపేట : విత్తన విక్రయ రశీదులు, స్టాక్ రిజిస్టర్లు సరిగా ఉండేలా చూసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి శశికాంత్ డీలర్లకు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, పురుగు మందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు అందజేయాలని తెలిపారు. విత్తన విక్రయ రసీదులపై రైతుల సంతకాలు ఉండేలా చూడాలని చెప్పారు. వానాకాలం నేపథ్యంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సుల గడువు ముగిస్తే వెంటనే రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని తేటతెల్లం చేశారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఈఓలు రఘుపతి, స్మిత, వినయ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

దామెర : ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్‌అలీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని ఊరుగొండ సర్వే నంబర్ 82లో 11 ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, అనుమతులు ఎలా మంజూరు చేశారో అధికారులు తెలపాలని నిలదీశారు. ఓ వ్యక్తి 70 గజాల భూమికి బదులుగా ప్రస్తుతం 450 గజాల భూమి రిజిస్ట్రేషన్ ఎలా చేసుకుంటాడని ప్రశ్నించారు. దుర్గంపేట్ ఎంపీటీసీ గండు రాము మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశామని జెడ్పీటీసీ గరిగె కల్పన అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శంకర్ మాట్లాడుతూ త్వరలో పదవీకాలం ముగియనుందని చెప్పారు. ఐదేళ్ల పాటు మండల అభివృద్ధికి కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, మౌనికకిరణ్, సంధ్య అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి

ఐనవోలు : సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. మండలంలోని వనమాల కనపర్తిలో శుక్రవారం వీఓ సభ్యుల సమక్షంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విడిపోయే భార్యాభర్తలకు సఖి సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు.

తునికాకు కల్లాల తనిఖీ

గూడూరు : మండలంలోని మట్టెవాడ యూనిట్ పరిధిలోని ఊట్ల, మట్టెవాడ, కొంగరగిద్ద గ్రామాల్లోని తునికాకు కల్లాలను డీఎఫ్ఓ బత్తుల విశాల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆకుల కట్టలు తడవకుండా చూడాలని సూచించారు. అలాగే ఎండిన కట్టలను ఎప్పటికప్పుడు కాపాడేలా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ చంద్రశేఖర్‌రావు, ఎఫ్ఆర్వో సురేష్, బీట్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి ఇంకెన్నాళ్లు..?

● ఏడాదిగా నిలిచిన బీటీ రోడ్డు పనులు



కంకర పోసి ఉన్న రోడ్డు



రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం (ఫైల్)

నర్సంపేట రూరల్ : మండలంలోని మాదన్నపేట నుంచి భోజ్యానాయక్‌తండా వరకు ప్రారంభించిన బీటీ రోడ్డు పనులు ఇంకెన్నాళ్లకు పూర్తి చేస్తారంటూ ఆ రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మీద ప్రయాణించాలంటే ఏడాదిగా రోజూ ఇబ్బంది పడుతున్నామంటూ జనం వాపోతున్నారు.

నర్సంపేట మండలంలోని మాదన్నపేట నుంచి భోజ్యానాయక్‌తండాకు వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డుకు మధ్య వ్యవసాయ భూములున్నాయి. నిత్యం రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడం పరిపాటి. భోజ్యానాయక్‌తండా నుంచి నర్సంపేటకు రావాలంటే మాదన్నపేట గ్రామం మీదుగా త్వరగా చేరుకునే అవకాశం ఉంది. లేదంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. ఈ రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గత ప్రభుత్వం రూ.72 లక్షలు కేటాయించగా 2023 మే నెలలో నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పనులను ప్రారంభించారు. కాగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత మేరకు నత్తనడకన పనులు సాగించారు. మట్టి రోడ్డును తవ్వి కంకర పోసి చేతులు దులుపుకున్నారు. ఇక నాటి నుంచి పనులు కొనసాగించిన దాఖలాల్లేవు. ఈ క్రమంలో ఆ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే రెండు గ్రామాల ప్రజలు నరకం అనుభవించక తప్పడం లేదు. పలుమార్లు ప్రమాదాలూ జరిగాయి. ఇకనైనా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



గూడూరు : మండల కేంద్రంలోని హనుమాన్ భక్తమండలి, శ్రీ లక్ష్మీ నారాయణస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మండలంలోని 39 జీపీలలో కలిపి మొత్తం 500 మంది వరకు హనుమాన్ మాలలు ధరించారు. గురుస్వామి మేరుగు మల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో హనుమత్ విగ్రహంతో స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర చేపట్టారు. ఆ యాత్రను లక్ష్మీనారాయణస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మల్లయ్యగౌడ్ హనుమాన్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో గురుస్వాములు భూక్య రవి, వెంకన్న, బాధావత్ చందు, మేరుగు మధు, దేవేందర్, వెంకన్న, రాజు,యాకయ్య, కోరె దేవేందర్, మాలాధరులు పాల్గొన్నారు.